## ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి


మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4: వివాహ శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలు, తీర్థయాత్రలకు, ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని మెదక్ డీఎం సురేఖ ప్రకటనలో తెలిపారు. 200 కిలోమీటర్లకు పల్లెవెలుగు బస్సుకు రూ.13,200, ఎక్స్‌ప్రెస్ బస్సుకు 200 కిలోమీటర్లకు రూ.14,700, సమయం బయలుదేరిన సమయం నుంచి 12 గంటల వరకు వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు.

## ఎల్ఈడీ టీవీ బహూకరించిన మాజీ జడ్పీటీసీ



శివ్వంపేట, ఫిబ్రవరి 4: శివ్వంపేట ప్రాథమిక పాఠశాలకు మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.30 వేల విలువ చేసే ఎల్ఈడీ టీవీని మంగళవారం బహూకరించారు. సాంకేతిక విద్యను ప్రసార మాధ్యమాల ద్వారా ఉపయోగించుకోవడానికి తనవంతు సాయం చేసినట్లు ఆయన తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సయ్య, రామాగౌడ్, వంజరి కొండల్, పోచాగౌడ్, మియ్యాడి సింహం, లక్ష్మీనారాయణ, సంతోశ్, వెంకటేశ్, శ్రీనివాస్‌యాదవ్, త్రినేశ్ ఉన్నారు.

## ద్విచక్ర వాహనం చోరీ



బైక్ ఎత్తుకెళ్తున్న వ్యక్తి

రామాయంపేట, ఫిబ్రవరి 4: ద్విచక్ర వాహనం చోరీ అయిన ఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని రైల్వే గేటు వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేటకు చెందిన శ్రీనివాస్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే అక్కన్నపేటలో తన బైక్‌ను రైల్వే గేటువద్ద పార్కు చేసి గ్రామంలో విద్యుత్ మీటర్ల నుంచి బిల్లులు ఎంట్రీ చేస్తున్నాడు. పనులు ముగించుకుని బైక్ నిలిపిన వద్దకు వచ్చాడు. అక్కడ బైక్ లేదు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి బైక్‌ను తీసుకెళ్తున్న దృశ్యం రికార్డైంది. బైక్ నెంబర్ టీఎస్7ఎఫ్‌డి2830 చోరీ అయినట్లు రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఏఎస్సై, సిబ్బంది

చిలిపిచెడ్, ఫిబ్రవరి 4: గంజాయి, మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై మిస్బొద్దీన్ తెలిపారు. చండూర్ చౌరస్తాలో పోలీస్ సిబ్బందితో సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సిబ్బంది దుర్గాప్రసాద్, సతీశ్, స్వామి పాల్గొన్నారు.

## బోరు మోటర్‌ను దొంగిలించిన దుండగులు



ట్రాక్టర్‌కు విద్యుత్ షాక్ పెట్టిన వైర్‌ను చూపుతున్న సంతోశ్

నిజాంపేట, ఫిబ్రవరి 4: పొలం వద్ద బోరు మోటర్‌ను దొంగిలించడంతో పాటు ఆగి ఉన్న ట్రాక్టర్‌కు విద్యుత్ షాక్ పెట్టిన ఘటన మండలంలోని తిప్పనగుల్ల గ్రామంలో వెలుగు చూసింది. బాధిత రైతు బెల్లం సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. పొలం వద్ద ఉన్న కాల్వలో రూ.25 వేల బోరుమోటర్‌ను అమర్చారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. స్టార్టర్ నుంచి వైర్ ద్వారా పొలం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌కు కనెక్షన్ ఇచ్చి విద్యుత్ షాక్ పెట్టారు. పొలం వద్దకు రావాలంటేనే ప్రాణభయంగా ఉందని అధికారులకు బాధిత రైతులు మొరపెట్టుకున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చేగుంట, ఫిబ్రవరి 4: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి నర్సింహులు ముదిరాజ్ నీటిలో పడి మృతిచెందాడు. ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి తలారి భిక్షపతి ముదిరాజ్, జిల్లా నాయకుడు గడ్డమీది రఘుపతి ముదిరాజ్ రూ.5100, 50 కిలోల మంగళవారం బియ్యాన్ని అందజేశారు.

## బంజారాల సమస్యలపై నిరంతర పోరు



అధ్యక్షుడు లింబాద్రిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 4: తూప్రాన్ డివిజన్‌లోని బంజారా ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ లింబాద్రి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బంజారా ఉద్యోగుల సంఘం సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలిండియా బంజారా ఉద్యోగుల సేవా సంఘం కమిటీ తూప్రాన్ డివిజన్ అధ్యక్షుడిగా డాక్టర్ లింబాద్రి, ప్రధాన కార్యదర్శిగా వంశీ రాథోడ్, అఫీషియల్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బంజారా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సమితీ సభ్యులు ఆరె కిషన్, సామ్య, గబ్బర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు చేసి పనులు చేశాం.. బిల్లులివ్వండి



చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ మాజీ సర్పంచులను అరెస్టు చేసిన పోలీసులు



రామాయంపేట: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు



నిజాంపేట: మండలంలోని మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

- **తాము చేసిన పనుల బిల్లులిచ్చి ఎన్నికలు పెట్టాలని డిమాండ్**
- **మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు**

రామాయంపేట/ చిలిపిచెడ్/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 4: పంచాయతీల్లో అప్పులు చేసి పనులు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ బిల్లులు చెల్లించి ఎన్నికలు పెట్టాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ వద్ద ధర్నాకు తరలివెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నర్సాగౌడ్, సుభాష్ రాథోడ్, సురేశ్, ఇమానియేల్, ఉమామహేశ్వర్, మల్లేశం ఉన్నారు.

**చిలిపిచెడ్‌లో..**

చిలిపిచెడ్ మండలంలోని మాజీ సర్పంచుల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ తరలివెళ్తున్న బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు లక్ష్మణ్, యాదగిరి, రాకేశ్‌నాయక్, నాయకులు అంబర్ సింగ్, విఠల్, హన్మంత్‌ను అరెస్టు చేశారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మాజీ సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరియాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, ఫిబ్రవరి 4: పెండింగ్ బిల్లులు చెల్లించకుండా అక్రమ అరెస్టులు చేయడం అన్యాయమని నిజాంపేట మండల మాజీ సర్పంచులు అరుణ్‌కుమార్, లక్ష్మీనర్సింహులు అన్నారు. వీరిని నిజాంపేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. గ్రామాభివృద్ధి కోసం సొంత డబ్బు ఖర్చుపెట్టామని, బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



చిన్నశంకరంపేట: పోలీసుల అదుపులో ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు

## జల్సాలు, బెట్టింగ్‌ల కోసం చైన్ స్నాచింగ్

**- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4: జల్సాలు, బెటింగ్‌లకు అలవాటు పడి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖదీర్, మహమ్మద్ అబ్దుల్ షఫీ ఇద్దరు వారి స్నేహితుడైన మహ్మద్ హఫీజ్ వద్ద నుంచి బైక్ తీసుకుని చైన్ స్నాచింగ్ పాల్పడుతున్నారు. జల్సాలు, బెట్టింగ్‌కు అలవాటు పడిన వీరు ద్విచక్ర వాహనాదారులను చిరునామా అడుగుతున్నట్లు నటిస్తూ చైన్ స్నాచింగ్ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఔరంగాబాద్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా యునికార్ బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. వీరు తప్పించుకుని పారిపోయారు. పోలీసులు వారిని వెంబడించారు. హవేళీఘనపూర్ మండలంలోని ముత్తాయికోట, జక్కన్నపేట, బూరుగుపల్లి శివారులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి ఆరు తులాల బంగారం, రెండు హెల్మెట్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని రికవరీ చేశారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సీతారాంపూర్, రాజంపేట, భిక్కనూర్ మండలం జంగంపల్లి శివారులో ఆరు తులాల బంగారాన్ని చైన్ స్నాచింగ్ చేశారు. కామారెడ్డిలో చైన్ స్నాచింగ్‌లో దోచుకున్న బంగారాన్ని హైదరాబాదులోని వాల్యూ గోల్డ్‌లో అమ్మగా వచ్చిన రూ.2,08,293 నగదును చెరిసగం పంచుకున్నారు. వాల్యూ గోల్డ్ వారికి నోటీసులు ఇచ్చామని, దాన్ని కూడా రికవరీ చేస్తామని ఎస్పీ తెలిపారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపర్చుకోవాలి

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 4: జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి సంబంధించి ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ మండలంలో బాలనగర్‌లో శివారులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి సంబంధించి షెడ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, డాక్టర్ లక్ష్మణ్, తదితరులు ఉన్నారు

## సామూహిక సూర్య నమస్కారాలు



మెదక్ మున్సిపాలిటీ: సూర్య నమస్కారాలు



రామాయంపేటలో చిన్నారుల సూర్య నమస్కారాలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 4: రథసప్తమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో మంగళవారం సామూహిక సూర్య నమస్కారాలు చేశారు. 11 మంది విద్యార్థులు 250కి పైగా సూర్య నమస్కారాలు చేసి అందరికని ఆకట్టుకున్నారు.

**రామాయంపేటలో..**

రామాయంపేట, ఫిబ్రవరి 4: రామాయంపేటలోని చిన్నారులతో యువజ్యోతి క్లబ్ నిర్వాహకుడు బొంతల సత్యం సూర్య నమస్కారాలను చేయించారు. వివేకానంద ఆవాస విద్యార్థులు పలు ఆసనాలు వేశారు.

## మాటతప్పిన సీఎంగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారు

**ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ**

శివ్వంపేట, ఫిబ్రవరి 4: బీసీ కులగణనపై రేవంత్‌రెడ్డి మాటతప్పిన సీఎంగా చరిత్రలో నిలుస్తాడని ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి, ఈరోజు చట్టసభల్లో చేతులెత్తేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆనాడు పీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి 50 శాతం ఉన్న బీసీలకు కేవలం 22 శాతం మాత్రమే టికెట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారన్నారు. నేడు చట్టసభల్లో అసాధ్యమని మాటమార్చడం చేతగానితనానికి నిదర్శనమన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. బీసీలను మోసం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తానంటే కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడం ఖాయమని హెచ్చరించారు.

## పచ్చిక మైదానం అనుకున్నారా?



చాముండేశ్వరి ఆలయం వద్ద మంజీరా నదిలో గుర్రపు డెక్క

చిత్రంలో కనిపిస్తున్నది పచ్చిక మైదానం అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. చిలిపిచెడ్ మండలంలోని చాముండేశ్వరి ఆలయం వద్ద మెదక్, సంగారెడ్డి జిల్లా సరిహద్దు మధ్య మంజీరా నది బ్రిడ్జి కింద గుర్రపు డెక్కలు పెరిగి నీటి చుక్క కనబడడం లేదు. అందుకే పచ్చని మైదానంలా తలపిస్తున్నది. మంజీరా నదిలో గుర్రపు డెక్కను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

**- చిలిపిచెడ్, ఫిబ్రవరి 4**

## విద్య వ్యవస్థ పటిష్టతకు కృషి

**టీపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్**

మెదక్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : ధన రాజకీయాలను ఓడించి, ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని యూటీఎఫ్ బలపరిచిన టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం మెదక్‌లో మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా తాను ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యా రంగ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలంటే ఉద్యమ నేతలను ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పద్మారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంగయ్య, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాడు ఆదర్శ గ్రామం.. నేడు అధ్వానం



చెత్తాచెదారం నిండిన మురుగు కాలువ



మట్టితో పూర్తిగా పూడుకుపోయిన మురుగు కాలువ



తాళం వేసి ఉన్న పంచాయతీ కార్యాలయం

- **అందుబాటులో ఉండని అధికారులు**
- **పేరుకుపోతున్న సమస్యలు**
- **పట్టించుకోని ప్రత్యేకాధికారులు**

రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 4: ఒకప్పుడు ఆ గ్రామం మండలంలోనే కాదు జిల్లాలోనే ఆదర్శ గ్రామం. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం లేకుండా వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేవి. అంతేకాకుండా గ్రామ పంచాయతీలో అధికారులు, పాలకవర్గం సైతం అందుబాటులో ఉండేవారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రామాయంపేట మండలంలోని దామరచెర్వు గ్రామ పంచాయతీ పరిస్థితి అధ్వానంగా తయారైంది. పంచాయతీ పాలకవర్గం గడువు ముగిసిన నాటి నుంచి పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. మొదట్లో గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసినా నెలలు గడవడంతో అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రారంభించారు. గ్రామంలోని సమస్యలు చెప్పడానికి ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. అప్పుడప్పుడు అందుబాటులో ఉండే పంచాయతీ కార్యదర్శి సమయ పాలన పాటించకుండా ఇష్టారీతిలో రావడం, ఉన్న కొద్దిపాటి సమయంలోనూ పంచాయతీ కార్యాలయం వద్ద ఉండకపోవడంతో గ్రామస్తులు తమ సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీంతో గ్రామంలోని పలు వార్డుల్లో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమస్యలు తెలిపితే గ్రామంలో ఎవరో ఒకరి పేరు చెప్పి వారికి తమ సమస్య చెప్పాలని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీని ఇలా నిర్లక్ష్యం చేయడం సరికాదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

## ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి: ఏడీఏ




ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కౌడిపల్లి, ఫిబ్రవరి 4: ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ పుణ్యవతి హెచ్చరించారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఏఈవో స్వప్న జాదవ్‌తో కలిసి మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ ధరలకు ఎరువులు అమ్మినట్లు రుజువైతే లైసెన్స్‌లు రద్దుచేస్తామని హెచ్చరించారు. దుకాణంలో ఎల్లప్పుడు యూరియా నిల్వ ఉండేలా చూసుకోవాలని, ఎక్కడా కొరత లేకుండా చూసుకోవాలన్నారు. దుకాణం ఎదుట స్టాక్ బోర్డులో ధరలు, స్టాక్ వివరాలను పొందు పర్చి, ఈ పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలన్నారు.

## ఆలయాలకు పెద్దపీట వేసింది కేసీఆరే

**బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి**



వేంకటేశ్వర ఆలయంలో కంఠారెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో ఆలయాలకు పెద్దపీట వేసింది బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం రామాయంపేటలోని అయ్యప్ప ఆలయ 11వ వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ కంఠారెడ్డిని సన్మానించారు. ఆయన వెంట మాజీ పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, మర్కు నగేశ్, కన్నపురం కృష్ణాగౌడ్, పటేరి రాము, రాజు, మల్యాల కిషన్, నర్సారెడ్డి, చింతల స్వామి, భాను, నాగార్జున ఉన్నారు.

## క్రీడాకారులకు బహుమతులు అందజేత



చేగుంట, ఫిబ్రవరి 4: నార్సింగిలో మండలం నర్సంపల్లి పెద్దతండాలో సేవాలాల్ జగదాంబ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు అందజేశారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

శివ్వంపేట, ఫిబ్రవరి 4: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట పంచాయతీ పరిధిలోని రాములు తండాలకు చెందిన రైతు పాల్త్య రాంలాల్ (54) తన భార్యతో కలిసి సోమవారం పొలం వద్దకు వెళ్లారు. పొలానికి నీరు పెట్టడానికి బోరుమోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే కుటుంబీకుల సహాయంతో మల్లారెడ్డి దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఘనంగా బోనాల ఊరేగింపు



తిమ్మాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

కౌడిపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మకు మంగళవారం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన ఏడంతురాల బోనంతో పాటు ప్రతి ఇంటి నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

## తిరుమలస్వామి జాతరకు పోటెత్తిన భక్తులు

నిజాంపేట, ఫిబ్రవరి 4: రథసప్తమి సందర్భంగా చల్మెడలోని తిరుమలనాథ స్వామి జాతరకు భక్తజనం పోటెత్తారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే తిరుమలనాథ స్వామి కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, సభ్యులు, మాజీ సర్పంచులు అమరసేనారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, AFSARI BEGUM, W/o. Mohammad Saberurrahman, R/o. H.No. 2-4-176, Sajidpura, Siddipet, Siddipet Dist., T.S. My Correct Name is AFSARI BEGUM (New Name), My Name is wrongly mentioned as MOHAMMAD AFSARI BEGUM (Old Name). I want to Change My Name as AFSARI BEGUM in My Husband Passport.

NT-Venkat

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.